# ది డర్టీ డాగ్



శ్రీశ్రీశ్రీ శ్రీనివాసరావుగారింట్లో ఫెళ్ళు మని పెళ్ళయింది. ధభిల్లని దీపాలు వెలిగాయి గుభిల్లని గుండెలదరగా పోలీసుబాండు చప్పట్లుకొట్టింది.

శ్రీనివాసరావుగారింట్లో — ఇల్లంటే ఇల్లూకాదూ, మేడంటే మేడాకాదూ— పదిలంగా మనలాంటి బతకడం తెలి యని అడ్డమైన వాళ్ల బతుకులూ పిండేసి — పట్టణానికి పయోధరాల్లా వున్న ఎత్తైన ఒక గుట్టమీద—పదివేల చదరపుగజాల్లో—పదివేలమంది పట్టు దలగా కట్టిన — పండు లాంటి—పనస పండులాంటి—ఒకే అంతస్థుగల పనసం దైన పొదరిల్లు.

ఆ పొదరింట్లో—పాముపడగమీద మాణిక్యంలా శ్రీనివాసరావుగారి నెత్తి మీద దేవతలాంటి మనోరంజని — జెర్రిపోతులాంటి సూరిరావుని పెద్దల

భైరవయ్య

సమక్షంలో పెళ్ళిచేసుకుంది. మనోరంజని కన్యాత్వాన్ని సూరిరావుకి ధారపోయ డంతో, రావుగారికి అటు ఏడు తరాలూ—ఇటు ఏడుతరాలూ టకటక మని స్వర్గపు మెట్లెక్కేసి వైటింగ్ లిస్టులో పేర్లు రాసేసాయి.

ఆ సందర్భాన్ని పురస్కరించుకుని, రావుగారు పట్టణంలో బతకడం తెలిసిన పెద్దమనుషుల్ని కేవలం తమ సంతృప్తి కోసం, వచ్చి—కోటలాంటి హోటల్లో తయారైన ప్రత్యేకమైన వంటకాలు—సేనాధిపతుల్లాంటి బేరర్స్ వడ్డిస్తోంటే—అరగించమన్నారు.

ఆ పొదరింటిచుట్టూ పచ్చగా — కాన్సెన్ట్రేటెడ్ వెల్తురులా—చెర్లో నాచులా వున్న మెత్తటి లాన్స్ మీద జరుగుతున్న ప్రస్తుత కార్యక్రమమది.

ఆ పొదరింటికి కాపలాగా నాలుగు వైపులా మొగలిడొంకలా పెద్దగోడ—ఆ గోడలోంచి లోపలి కెళ్ళటాని కొక్కటే తోవ. అందులోంచి ఊర కుక్కలూ, కుక్కల్లాంటి మనుషులూ వెళ్ళకుండా అడ్డుగా యముల్లాంటి వాచ్ మెనూ—ఆ వాచ్‌మేను కళ్ళుగప్పి ఎవడైనా లోపలికెళ్ళితే పెర్మనెంటుగా బయటికి రాకుండా పిక్కలూడదీసి పేగులు తాళ్ళలా పేనెయ్యడానికి రెడీగా వున్న నాలుగు మనిషెత్తు సీమకుక్కలూ ఎప్పుడూ వుంటాయి.

శ్రీనివాసరావుగారింట్లో పెళ్ళి విందు జరుగుతోంది.

నారిగాడు భళ్ళుమని వాంతిచేసు కున్నాడు. మూడు రోజుల్నించి కూడు లేదు. ఎక్కడా పనిదొరకలేదు. ఒక్క నాయాల పైసైనా ఇయ్యలేదు. మునిసి పాలిటీ కుళాయిలోంచి బొట్లు బొట్లుగా కారుతున్న నీళ్ళచుక్కల్తో కడుపు నింపుకుంటే అవి కాసినీ బయటి కెళ్ళిపోయాయి.

నారిగాడు డొక్కగిరిపోయిన గోదా వరిలా వున్నాడు. ఎవడో కుర్రాడు అబగా చీకిపారేసిన మామిడి టెంకలా వున్నాడు. ఒంటినిండా పగిలిపోయిన పుళ్ళతో ఇంద్రుడిలా వున్నాడు.

నారిగాడు ఏ బాబుకీ — అమ్మకీ పుట్టాడో, వాడి బాబుకే—అమ్మకే తెలి యదు. పేడలో పురుగులా పెరిగాడు. ఈ నాగరికతమీద పుండులా బతుకు తున్నాడు.

రావుగారు చాలా దయాస్వరూపులు. పట్నంలోవున్న పెద్దలంతావచ్చి తిన్లేక వాంతిచేసుకున్న పదార్థాలు వేష్టుచెయ్య కుండా బీదాబిక్కీకి పంచేస్తారు. వారు దుబారా ఇష్టపడరు.

రావుగారి దాతృత్వాన్ని అందుకో డానికి వచ్చిన వాళ్ళలో నారిగాడు కూడా వున్నాడు, బాక్టీరియాలాగ.

రావుగారింట్లో విందు జరుగుతోంది. గంటన్నరనుంచీ సాగుతోంది. ఒకదాని

తర్వాత ఒకటి పదార్థాలు వస్తున్నాయి. పళ్ళేలకి పళ్ళేలు మాయమవుతున్నాయి.

పెద్దలు ఆయాసపడకుండా ఇద్దరు పనసతొనల్లాంటి కాబరే డాన్సర్లని పట్టుకొచ్చారు రావుగారు. వాళ్ళు శరీరంలో ప్రతి అవయవాన్నీ ఊపేస్తున్నారు.


ఆ పొదరింటి గేటుదగ్గర వాచ్‌మేను మాన్‌సింగ్ నారిగాడిలాంటి కుక్కల్నీ, మనుషుల్నీ తోలేస్తున్నాడు. సీమకుక్కల్లాంటి పెద్దమనుషుల్ని పొరపాటున ఊరకుక్కలని మిసండర్‌స్టాండ్ చేసుకుంటాయేమోనని, ఇంట్లోవున్న సీమకుక్కల్ని అంగుళం మందంవున్న ఇనపగొలుసులతో కట్టించేసిన రావుగార్ని తిట్టుకుంటున్నాడు. లేకపోతే తనుకూడా మిగతా నౌకర్లతోపాటువెళ్ళి కాబూలీ దానిమ్మపళ్ళలాంటి కాబరే డాన్సర్లని చూసును. ఆ కోపమంతా నారిగాడిలాంటి వాళ్ళమీద చూపిస్తున్నాడు.

నారిగాడికి ఈ విందు ముగుస్తుందని నమ్మకం చాలటంలేదు. ముగిసినా మిగిలింది ఇంతమంది మధ్య తనకి దొరుకుతుందని ధైర్యంలేదు. వాడి జీవితానికది క్లైమాక్సో—చరమాంకమో తెలియటంలేదు. అందర్నీ ఎదిరించి పది మెతుకులైనా దొరికించుకోటానికి సత్తాలేదు. దిక్కులేని పీనుగులా బిక్కచచ్చిపోయి అంతదూరంనుంచి — గేటులోంచి — లోపలికి — వెలుతుర్లో చూస్తున్నాడు. గేటుదాటి లోపలికి వెళ్ళడానికి కాళ్ళాడటంలేదు. ఎదురుగుండా అడవిపందిలా వున్నాడు వాచ్‌మేను. వాచ్‌మేను మాన్‌సింగ్‌కి చర్మరంధ్రాల్లోంచి వేడి పుడుతోంది. కసిగా బీడీని నలుపుతూ తాగుతున్నాడు.

లాన్‌లోంచి ఆనందంగా హాహాకారాలు వినిపిస్తున్నాయి. బాండుమేళం అమ్మవారిజాతర డప్పుల్లా ఢణాఢణామంటోంది. అంతకన్నా వేగంగా డాన్సర్లు అవయవాలన్నీ ఊపేస్తూ వీడి ఒళ్లో వాడి ఒళ్లో వాలిపోతో ఉన్నారు. కొన్నిగజాల దూరంలో నుంచున్న నౌకర్లంతా — శవాల్ని మోసుకుపోయే వాళ్ళలా వున్నారు. మాన్‌సింగు రక్తం వేడెక్కింది. లాఠీని గట్టిగా నేలమీద మూడుసార్లుకొట్టాడు. 'బద్మాష్' అని ఎవర్నో తిట్టాడు. దూసుకుంటూ లాన్స్ వేపు వెళ్ళిపోయాడు.

నారిగాడు నీరసంతో ఒళ్ళు తూలిపోయి గోడపక్కన అలాగే వాలిపోయి కూర్చున్నాడు. మాన్‌సింగు కాలుస్తున్న బీడీచూసి పళ్ళు దురదలు పెట్టాయి. మాన్‌సింగు లోపలికి దూసుకుపోతూ గిరాటెట్టిన బీడీని అందుకోడానికి దేకుతుంటే ఈ లోపున మరోడొచ్చి కాల్తో నారిగాడ్ని తోసేసి ఆ బీడీ పట్టుకుపోయాడు.

నారిగాడికళ్ళలో నీళ్ళుంకిపోయాయి. మాన్‌సింగు గేటుదగ్గర లేడు. మెల్లిగా




దేక్కుంటూ నారిగాడు గేటుదగ్గర కెళ్ళాడు. కొంతసేపు అక్కడేవున్నాడు. ఎండిపోయిన శరీరాన్ని ఈడ్చుకుంటూ లాన్సవేపు వెళ్ళాడు.

నారిగాడి మసకకళ్ళకి పదార్థాలన్నీ ఒకలాగే కనిపించినా, అవన్నీ ఆర బెట్టిన వాడి ఆకల్లా వున్నాయి. వాడి నోట్లోంచి, ఒంట్లోంచి అన్నిరసాలు ఉబికొచ్చాయి. ఇన్నేళ్ళ వాడి దరిద్రం కళ్ళముందు కనిపించింది.

పండినపంట తినే మిడతల్లా వున్నా రందరూ.

నారిగాడు ఒక్కఊపులో లాన్స దాటి—నౌఖర్లనిదాటి — టేబిల్స్‌దాటి మధ్యకొచ్చి నిలబడ్డాడు. పిచ్చికుక్కలా వున్నాడు. ఒక్కసారిగా అన్ని ప్లేట్లమీద దాడిచేసాడు. పిచ్చిగానవ్వుతూ బర్ఫీ—పులావ్—రోస్ట్ చికెన్ అన్నీ కొరుక్కు తింటున్నాడు.

జనం తెప్పుమన్నారు. కొందరు మూర్ఛపోయారు. కొందరు డర్టీ డాగ్ అన్నారు. 'ఎవడొదిలాడ్రా ఈ గజ్జి కుక్కని' అని అరిచారు, రావుగారు. ఈ లోపున మాన్‌సింగు అరివీర భయంకరంగా 'బద్మాష్' అని అరుచు కుంటూవచ్చాడు. లాఠీతో నారిగాడిచేతుల మీదకొట్టాడు.

నారిగాడు ఎహ్హె హ్హె అని నవ్వాడు. ఒక బర్ఫీ నోట్లో కుక్కుకున్నాడు.

మాన్‌సింగు అవమానం భరించలేదు.

మాన్‌సింగు లాఠీగాల్లో లేచింది. గిర్రున తిరిగింది. నారిగాడి తల బద్ద లైంది. వాడి తలమీద గడ్డకట్టిన నెత్తురు ఈ దేశంలోని లేమింలా వుంది.